క్లుప్తంగా

13న జాతీయ లోక్ అదాలత్

నగరి: జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని నగరి జూనియర్ సివిల్‌జడ్జి వి.గోపాలకృష్ణ సోమవారంఒక ప్రకటనలో తెలిపారు. మే నెల 13వ తేదీన జాతీయ లోక్ అదాలత్ జరుగుతుందన్నారు. పలు రకాల కేసులను అక్కడికక్కడే పరిష్కరిస్తామన్నారు. రాజీ పడడంతో ఇరువురు గెలిచినట్లే అని లోక్ అదాలత్ ద్వారా ఇరువురికి సమాన న్యాయం జరుగుతుందని తెలిపారు. ఇందులో చిన్నచిన్న తగాదాలతో కేసులు పెట్టుకుని కోర్టుల చుట్టూ తిరుగుతున్న వారు సమయాన్ని వృథా చేసుకోకుండా లోక్‌అదాలత్ ద్వారా రాజీపడే అవకాశం ఉందన్నారు. కోర్టు కేసులు, భూములకు సంబంధించి, క్రిమినల్ కేసులు, కుటుంబం పలు రకాల కేసులు పరిష్కరించుకోవచ్చని సూచించారు.

సుబ్రమణ్యానికి పరామర్శ



పరామర్శిస్తున్న కుమారస్వామిరెడ్డి

పుత్తూరు రూరల్: టీడీపీ నాయకుల దాడిలో తీవ్రంగా గాయపడి తిరుపతి రుయాలో చికిత్స పొందుతున్న వైఎస్సార్‌సీపీ నాయకుడు సుబ్రమణ్యంను సోమవారం మంత్రి ఆర్కే రోజా సోదరుడు, వైఎస్సార్‌సీపీ నేత వై.కుమారస్వామిరెడ్డి పరామర్శించారు. దాడి జరిగిన తీరు, దాడికి పాల్పడిన వారి వివరాలను అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం అందించాలని వైద్య సిబ్బందిని కోరారు. ధైర్యంగా ఉండాలని సుబ్రమణ్యంకు సూచించారు. పుత్తూరు రూరల్ మండలం తడుకు పంచాయతీ, తిరుమలరాజు కండ్రిగ గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ యువ నాయకుడు హేమాద్రిరాజు(33) గుండెపోటుతో సోమవారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న కుమారస్వామిరెడ్డి గ్రామానికి వెళ్లి మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మున్సిపల్ చైర్మన్ హరి, ప్రభురాజు, మధుసూదనరాజు, కుమార్ రాజు, దశరథరాజు, మునికృష్ణమరాజు, నాని తదితరులు పాల్గొన్నారు.

రీ సర్వేకి సహకరించండి



డ్రోన్‌ను పరిశీలిస్తున్న అధికారులు

పుత్తూరు రూరల్: వైఎస్సార్ జగనన్న శాశ్వత భూ హక్కు చట్టం కింద ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న రీసర్వే కార్యక్రమానికి పుత్తూరు ప్రజలు సహకరించాలని మున్సిపల్ కమిషనర్ కేఎల్ఎన్‌రెడ్డి కోరారు. సోమవారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో ఏరో డైన్ సంస్థ ఆధ్వర్యంలో డ్రోన్ ఫ్లై కార్యక్రమం నిర్వహించారు. కమిషనర్ మాట్లాడుతూ వారం రోజుల పాటు మున్సిపాలిటీలోని 27 వార్డుల్లో సర్వే జరుగుతుందని తెలిపారు. ప్రజాప్రతినిధులు, ప్రజలు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ హరి, వైస్ చైర్మన్లు శంకర్, జయప్రకాష్, కౌన్సిలర్లు, టౌన్ ప్లానింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

ముమ్మరంగా వాహన తనిఖీలు



వాహనాలు తనిఖీ చేస్తున్న సీఐ చంద్రశేఖర్

పాలసముద్రం: మండల పరిధిలోని తమిళనాడు సరిహద్దులో తమ సిబ్బందితో కార్వేటి నగరం సర్కిల్ సీఐ చంద్రశేఖర్ సోమవారం ముమ్మరంగా వాహనాలు తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల సరిహద్దులో ఉన్న కర్ణాటక రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికలు జరుగుతున్న నేపథ్యంలో తనిఖీలు చేస్తున్నట్లు చెప్పారు. అందువల్ల తమిళనాడు నుంచి మద్యం, నగదు అక్రమంగా తీసుకెళ్లకుండా ఎస్పీ రిశాంత్‌రెడ్డి ఆదేశాల మేరకు సరిహద్దు ప్రాంతాలను తనిఖీ చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం వాహనాలు ఆపి క్షుణ్ణంగా పరిశీలించారు.

దాస్యభక్తికి ప్రతీక హనుమంతుడు



మాట్లాడుతున్న ఆచార్య కె.సర్వోత్తమరావు

తిరుపతి కల్చరల్: నవవిధ భక్తి మార్గాల్లో ఒకటైన దాస్యభక్తికి ప్రతీక హనుమంతుడని ఎస్వీ యూ విశ్రాంత తెలుగు ఆచార్యులు కె.సర్వోత్తమరావు తెలిపారు. అన్నమాచార్య కళామందిరంలో నిర్వహిస్తున్న తాళ్లపాక అన్నమయ్య జయంతి ఉత్సవాలు సోమవారం మూడో రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా నిర్వహించిన సాహితీ సదస్సులో ఆయన అన్నమయ్య–హనుమత్ కీర్తనలు అనే అంశంపై ప్రసంగించారు. శ్రీవారి అవతారమైన శ్రీరాముడు–హనుమంతుడి మధ్య దాస్య భక్తిని, శరణాగతిని తెలియజేస్తూ అన్నమయ్య పలు సంకీర్తనలు రచించారని తెలిపారు. జాతీయ సంస్కృత వర్సిటీ తెలుగు ఆచార్యులు నల్లన్న, సహాయ ఆచార్యుడు గంగిశెట్టి లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

నాలుగేళ్లుగా సంక్షేమ పాలన

- రాష్ట్రంలోని మారుమూల ప్రాంతాలకు కూడా రోడ్లు వేశాం
- మరి 14 ఏళ్లు సీఎంగా ఉన్న చంద్రబాబు ఎందుకు వేయలేకపోయాడు ?
- ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చాం
- డిప్యూటీ సీఎం నారాయణస్వామి



సంక్షేమ పథకాల వివరాలను అడిగి తెలుసుకుంటున్న ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి

గంగాధరనెల్లూరు(కార్వేటినగరం): రాష్ట్రంలో సీఎం జగన్‌మోహన్ రెడ్డి జనరంజక పాలన అందజేస్తున్నారని, ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాల ద్వారా ప్రతీ గడపకు ఆర్థిక తోడ్పాటు అందుతోందని డిప్యూటీ సీఎం నారాయణస్వామి అన్నారు. మండలంలోని నెల్లేపల్లి సచివాలయ పరిధిలో గల గ్రామాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం నారాయణస్వామి ఇంటింటికీ వెళ్లి ప్రజల స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. గడిచిన నాలుగేళ్లలో ప్రభుత్వం అమలు చేసిన వివిధ సంక్షేమ పథకాల ద్వారా ఆయా కుటుంబాలకు చేకూరిన ప్రయోజనాలను కరపత్రాల ద్వారా వివరించారు. గత ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలనే కాకుండా ఇవ్వని అనేక హామీలను అమలు చేసిన ప్రభుత్వం తమదని సగర్వంగా చెప్పగలుగుతున్నామని తెలిపారు. సుస్థిర పాలన అందిస్తున్న తమ ప్రభుత్వానికి మరో అవకాశం ఇచ్చి, పేదరిక నిర్మూలనతో పాటు రాష్ట్రాభివృద్ధికి తోడ్పడాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. గత టీడీపీ ప్రభుత్వంలో పథకాలు పొందాలంటే జన్మభూమి



సచివాలయ సిబ్బందికి సూచనలు ఇస్తున్న డిప్యూటీ సీఎం నారాయణస్వామి

కమిటీ ఆదేశాలు అందేవి కాదని, నేడు వలంటీర్లు, సచివాలయం వ్యవస్థ ద్వారా అవినీతికి రావు లేకుండా అర్హులందరికీ పథకాలను అందిస్తున్నట్లు తెలిపారు. సువర్ణ పాలన అందిస్తున్న జగనన్న చల్లగా ఉండాలని ప్రజలు దీవిస్తున్నారని అన్నారు. సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయని తెలిపారు. రానున్న ఎన్నికల్లో ప్రజలు జగనన్నకు బ్రహ్మరథం పట్టేందుకు సిద్ధంగా ఉన్నారని తెలిపారు.

మా పాలనలోనే రోడ్లకు మహర్దశ ..

రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారం చేపట్టాక నాలుగేళ్లు మాత్రమే అయిందని, ఈ కాలంలో రాష్ట్రంలో రోడ్లు లేని మారుమూల ప్రాంతాలకు సైతం రోడ్లు వేసిన చరిత్ర మా ప్రభుత్వానిదేనని డిప్యూటీ సీఎం నారాయణస్వామి అన్నారు. 14 ఏళ్లు ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబు ఎందుకు గ్రామాలకు రోడ్లు వేయలేకపోయారని ప్రశ్నించారు. ఇప్పుడు అదే చంద్రబాబు అభివృద్ధిని చూసి ఓర్చుకోలేక ఇంకా కొన్ని గ్రామాలకు రోడ్లు వేయలేదని మాట్లాడడం అతని నీచ బుద్ధికి నిదర్శనమన్నారు.

వచ్చే ఎన్నికల్లో జగనన్నకే మా ఓటు..

లక్ష్మిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన మహిళలు డిప్యూటీ సీఎం నారాయణస్వామితో ముచ్చటించారు. ఈ ప్రభుత్వం వచ్చాక ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు అన్నీ కూడా తమ ఇళ్ల వద్దకే వస్తున్నాయని, చాలా సంతోషంగా ఉందని తెలిపారు. గతంలో తాము టీడీపీకి ఓటు వేశానని, ఈసారి మాత్రం జగనన్నకే వేస్తామన్నారు. తమ గ్రామంలో డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలని, అదేవిధంగా అర్హులైన వారికి ఇంటి పట్టా మంజూరు చేయాలని పలువురు డిప్యూటీ సీఎంకు విన్నవించారు. స్పందించిన ఆయన వెంటనే సమస్యలను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం కనికాపురం గ్రామానికి చెందిన బుజ్జమ్మ అనే మహిళ మాట్లాడుతూ సీఎం జగనన్న అందిస్తున్న అన్ని పథకాలు ఆడపడుచుల పేరుతో అందిస్తూ అండగా నిలుస్తున్నాడని, ఆయనకు తాము ఎప్పుడూ రుణపడి ఉంటామని తెలిపింది. ఆర్థికంగా పథకాలు అందించి ఆదుకుంటున్న జగనన్నకు వచ్చే ఎన్నికల్లో మహిళలంతా మద్దతు ఇస్తామని చెప్పింది. కార్యక్రమంలో రాష్ట్ర ఆర్టీసీ వైస్ చైర్మన్ ఎం.సీ విజయానందరెడ్డి, మండల కన్వీనర్ పూర్ణచంద్రారెడ్డి, ఎంపీపీ అనిత, వైస్ ఎంపీపీలు హరిబాబు, బేబి, జిల్లా రైతు విభాగం అధ్యక్షుడు వెంకటరెడ్డి, రమేష్, గుణారెడ్డి, సర్పంచ్ రవిచంద్రారెడ్డి, వెదురుకుప్పం, శ్రీరంగరాజపురం, పెనుమూరు మండల నాయకులు, ఎంపీడీఓ శ్రీదేవి, తహసీల్దార్ ఇన్బనాథన్, ఏపీఎం చిరంజీవి, ఏఎంసీ చైర్మన్ కమలాకర్‌రెడ్డి, పంచాయతీరాజ్ డీఈ దయాకర్ రెడ్డి, హౌసింగ్ డీఈ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ఉనికి కోసమే టీడీపీ నీచ రాజకీయాలు



మాట్లాడుతున్న జెడ్పీటీసీ అన్బళగన్, కన్వీనర్ తులసిరామ్ యాదవ్

పాలసముద్రం: ఉనికి కోసమే స్థానిక టీడీపీ నాయకులు నీచ రాజకీయాలు చేస్తున్నారని జెడ్పీటీసీ సభ్యుడు అన్బళగన్, మండల కన్వీనర్ తులసిరామ్ యాదవ్, వైస్ ఎంపీపీ శేఖర్ యాదవ్ అన్నారు. సోమవారం వారు మండలకేంద్రంలో పార్టీ కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత రెండు రోజుల క్రితం డిప్యూటీ సీఎం నారాయణస్వామి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా కమ్మపాళెం గ్రామానికి వచ్చినప్పుడు టీడీపీ నాయకులు ఉనికి కోసం వీరంగం చేయడం సరికాదన్నారు. కావాలనే డిప్యూటీ సీఎంపైకి ఎగబారడం హేయమైన చర్య అని, ఆయన గురించి తప్పుడు మాటలు మాట్లాడడం వారి నీచ సంస్కృతికి నిదర్శమని మండిపడ్డారు. టీడీపీ నాయకులు మరోమారు ఇలాంటి దుశ్చర్యలకు పాల్పడితే తాము కూడా తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. ఇప్పటికైనా టీడీపీ నాయకులు నీచ రాజకీయాలను మానుకోవాలని సూచించారు. వైఎస్సార్‌సీపీలో ఎలాంటి వర్గవిభేదాలు లేవని, వచ్చే ఎన్నికల్లో అంతా కలిసికట్టుగా పని చేసి నారాయణస్వామిని భారీ మెజారిటీతో గెలిపించుకుంటామని తెలిపారు. రైతు భరోసాకేంద్రం చైర్మన్ పోలయ్య, మాజీ మండల అధ్యక్షురాలు ఇందిరమ్మ, సుందరరాజు, సర్పంచ్ గాలి మహేష్ బాబు, నరసింహనాయుడు, పద్మనాభనాయుడు, చంద్రశేఖర్‌రాజు, వేణు, రవిరెడ్డి, కృష్ణయ్య, గోపాల్, గోపి, లక్ష్మణన్ తదితరులు పాల్గొన్నారు.

అలరించిన అర్జున తపస్సు



తపస్సుమానును అధిరోహిస్తున్న అర్జున వేషధారి

శ్రీరంగరాజపురం: మండల పరిధిలోని కొత్తపల్లిలో జరుగుతున్న శ్రీద్రౌపదీ దేవీ సమేత ధర్మరాజుల వారి మహాభారత వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం నిర్వహించిన అర్జున తపస్సు భక్తులను ఆకట్టుకుంది. వేకువ జామున అర్చకులు స్వామివారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం ద్రౌపదీదేవీ ఉత్సవమూర్తితో పాటు శ్రీకృష్ణ, భీమ, అర్జున, నకుల, సహదేవుల ఉత్సవ విగ్రహాలను గ్రామ వీధుల్లో ఊరేగించారు. మధ్యాహ్నం 12 గంటలకు ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన అర్జున తపస్సుమాను వద్దకు చేరుకున్న అర్జున వేషధారి తపస్సు ఘట్టానికి సంబంధించిన పద్యాలను ఆలపిస్తూ మాను అధిరోహించారు. ఈ క్రమంలో తీసుకెళ్లిన విభూధి, నిమ్మ పండ్లను కిందకు విసరగా వాటి కోసం భక్తులు ఎగబడ్డారు. అలాగే సంతానం లేని మహిళలు సంతానం కోసం తడిదుస్తులతో తపస్సు మాను చుట్టూ వరపడ్డారు. అర్జున తపస్సుకు సంబంధించిన ఘట్టాన్ని భాగవతారిణి సుమతి భక్తులకు కనులకు కట్టినట్లు వివరించారు. ఈ కార్యక్రమానికి కొత్తపల్లి గ్రామస్తులు ఉభయదారులుగా వ్యవహరించారు. ఆలయ ధర్మకర్త నాగరాజు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

3వ ఏడీజేగా గురునాథ్

తిరుపతి లీగల్: తిరుపతి 3వ అదనపు జిల్లా జడ్జిగా (ఏడీజే)గా ఎం.గురునాథ్‌ను నియమిస్తూ రాష్ట్ర హైకోర్టు సోమవారం ఉత్తర్వులు జారీచేసింది. జడ్జి గురునాథ్ ప్రస్తుతం రాష్ట్ర హైకోర్టు న్యాయసేవా సంస్థ కార్యదర్శిగా పని చేస్తున్నారు. ప్రస్తుతం 3వ అదనపు జిల్లా జడ్జిగా ఉన్న వై.వీర్రాజు టీటీడీ లా ఆఫీసర్‌గా బదిలీ అయిన విషయం తెలిసిందే.

వీడియో కాన్ఫరెన్స్ గది ప్రారంభం



వీడియో కాన్ఫరెన్స్ గదిని ప్రారంభిస్తున్న ఎంపీపీ

నగరి: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఆధునీకరించిన వీడియో కాన్ఫరెన్స్ గదిని ఎంపీపీ భార్గవి సోమవారం మధ్యాహ్నం మండల అధికారులు, ప్రజా ప్రతినిధుల సమక్షంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ అధికారులు వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించుకోడానికి గది సక్రమంగా లేకపోవడంతో మంత్రి ఆర్కేరోజా సహకారంతో గదిని ఆధునీకరించామన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఎంపీడీఓ శేషగిరి రావు, ఎంఈఓ శ్రీదేవి, వైస్ ఎంపీపీ కన్నియప్ప, తెరణి ఎంపీటీసీ యేసు, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకోండి



ఎంఈఓ శ్రీదేవి

నగరి: నిరుద్యోగ యువత కోసం నిర్వహిస్తున్న ఉచిత స్పోకెన్ ఇంగ్లిష్, పర్సనాలిటీ డెవలప్‌మెంట్ శిక్షణా తరగతులను సద్వినియోగం చేసుకోవాలని ఎంఈఓ శ్రీదేవి అన్నారు. సోమవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ పినాకా సంస్థ అధినేత బి.యాదగిరి ఐఆర్ఎస్ ఆధ్వర్యంలో ఏటా నగరిలో ఉచిత శిక్షణ అందజేస్తున్నట్లు చెప్పారు. ఈ నెల 13వ తేదీ నుంచి జూన్ 2వ తేదీ వరకు స్థానిక ఎస్‌జీఎస్ (జీహెచ్ఎస్) బాలికల ఉన్నత పాఠశాల, నగరిలో శిక్షణ ఉంటుందన్నారు. బ్యాంకింగ్, గ్రూప్ డిస్కషన్, సివిల్ సర్వీసెస్, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాలు, రైల్వే, స్టాఫ్ సెలక్షన్ కమిషన్ పోటీ పరీక్షలకు వెళ్లాలనుకునే వారికి ఈ శిక్షణ ఉపయోగపడుతుందన్నారు. అందులో భాగంగా మధ్యాహ్నం ఉచిత భోజన సౌకర్యం, స్టడీ మెటీరియల్ అందిస్తున్నట్లు తెలిపారు. వివరాలకు 93945066440 నంబరులో సంప్రదించాలని ఆమె కోరారు.

అభివృద్ధిని అడ్డుకోవడమేనా మీ పని !



సమావేశంలో పాల్గొన్న కౌన్సిలర్లు



మాట్లాడుతున్న చైర్మన్ హరి

- జరుగుతున్న అభివృద్ధి మీ కళ్లకు కనిపించడం లేదా ?
- టీడీపీ కౌన్సిలర్లపై మున్సిపల్ చైర్మన్ హరి ఫైర్
- వాడీవేడిగా కౌన్సిల్ సమావేశం

పుత్తూరు రూరల్: పుత్తూరు పురపాలక సంఘంలోని అన్ని వార్డుల్లో జరిగిన అభివృద్ధి, జరుగుతున్న పనులు మీ కళ్లకు కనబడడం లేదా అంటూ ప్రతిపక్ష టీడీపీ కౌన్సిలర్లపై మున్సిపల్ చైర్మన్ ఏ.హరి ఫైర్ అయ్యారు. సోమవారం స్థానిక వైఎస్సార్ సమావేశ మందిరంలో హరి అధ్యక్షతన మున్సిపల్ కౌన్సిల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ప్రతిపక్ష కౌన్సిలర్లు అడిగిన ప్రశ్నలకు చైర్మన్ హరి సమాధానం ఇచ్చారు. జనరల్ ఫండ్స్ నుంచి 30 శాతం నిధులు అభివృద్ధి పనులకు వినియోగించవచ్చని స్పష్టం చేశారు. తాము ఆర్థిక సంఘ నిధులు, సాధారణ నిధుల నుంచి అభివృద్ధి పనులు చేపడుతుంటే, అడ్డుకోవడమేనా మీ పని అంటూ ప్రశ్నించారు. అజెండాలోని అంశాలు కాకుండా ఇతరత్రా విషయాలు మాట్లాడడం మీ పనితీరుకు నిదర్శనమన్నారు. ఈశ్వరాలయం చుట్టూ ఆక్రమణలు తొలగించడం అభివృద్ధిలో భాగమని చెప్పారు. అక్కడ నుంచి తొలగించిన ఆరుగురిలో ఐదుగురికి జగనన్న ఇళ్ల నిర్మిస్తున్నామని, మరొకరు ప్రభుత్వ ఉద్యోగి అని తెలిపారు. భక్తుల కోరిక మేరకు ఈశ్వరాలయానికి మాడవీధులను ఏర్పాటు చేస్తున్నామని వివరించారు. పర్యాటక శాఖ మంత్రి ఆర్కే రోజా నేతృత్వంలో అన్ని వార్డుల్లో అభివృద్ధి జరిగిందని స్పష్టం చేశారు. మంత్రి చొరవతో 18వ వార్డులో రూ.1.10 కోట్లతో మున్సిపల్ పార్కును ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. రూ.2 కోట్లతో మున్సిపల్ కార్యాలయం, రూ.1.85 కోట్లతో షాదీమహల్, రూ.1.10 కోట్లతో శ్మశాన వాటిక పనులు, రూ.1.60 కోట్లతో రెండు అర్బన్ హెల్త్ సెంటర్లు, రూ.25 లక్షలతో ఈశ్వరాలయం కోనేరు పునఃనిర్మాణ పనులు జరుగుతున్నాయని తెలిపారు. రూ.25 లక్షలతో ధర్మరాజుల ఆలయ గోపుర నిర్మాణంతో పాటు అన్ని వార్డుల్లో సిమెంట్ రోడ్లు, డ్రైనేజీ నిర్మాణాలు జరిగాయని వివరించారు.

పునాదిరాయి వేసిన విషయం మర్చిపోతే ఎలా..!

గతంలో పుత్తూరు ఎమ్మెల్యేగా ఉన్న గాలి ముద్దుకృష్ణమనాయుడు ఈశ్వరాలయం కోనేరును పూడ్చి వేశారని, ఆయనే కోనేరు చుట్టూ షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణానికి పునాదిరాయి వేసిన విషయాన్ని టీడీపీ నాయకులు మరచిపోతే ఎలా అని కార్యక్రమంలో వైస్ చైర్మన్ జయప్రకాష్ ప్రశ్నించారు. అయితే అదే కోనేరును ప్రజల విజ్ఞప్తి మేరకు మంత్రి ఆర్కే రోజా దేవదాయ శాఖ నుంచి రూ.25 లక్షలు మంజూరు చేయించి పునరుద్ధరిస్తున్నారని చెప్పారు. పలువురికి జీవనోపాధి కల్పించడానికి షాపింగ్ కాంప్లెక్స్ నిర్మిస్తుంటే టీడీపీ నాయకులు జీర్ణించుకోలేక తప్పుడు ఆరోపణలు చేయడం సరికాదన్నారు. గతంలో గాలి ముద్దుకృష్ణమ నాయుడు కాంప్లెక్స్ నిర్మాణానికి లేని అభ్యంతరం ఇప్పుడెందుకు చెబుతున్నారని ప్రశ్నించారు. అభివృద్ధికి సహకరించకపోయినా పరవాలేదని, అడ్డుపడకుండా ఉండాలని ఆయన హితవు పలికారు. సమావేశంలో కమిషనర్ కేఎల్ఎన్‌రెడ్డి, వైస్ చైర్మన్లు డి.శంకర్, కౌన్సిలర్లు, కోఆప్షన్ మెంబర్లు, అధికారులు పాల్గొన్నారు.

కౌన్సిల్ ఆమోదించిన తీర్మానాలు..

- 27 వార్డుల్లో రూ.3.20 కోట్లతో 97 అభివృద్ధి పనులకు ఆమోదం
- పుత్తూరు శ్మశాన వాటిక కాంపౌండ్ వాల్ నిర్మాణానికి రూ.19.87 లక్షలు
- మూలకోన నుంచి పుత్తూరు వచ్చే పైపులైను మరమ్మతుల నిమిత్తం రూ.5 లక్షలు
- గోవిందపాళెం ట్యాంకు పైపులైను మరమ్మతుల నిమిత్తం రూ.4.80 లక్షలు

సమ్మర్ క్యాంపును సద్వినియోగం చేసుకోండి



మాట్లాడుతున్న హిందీ పండిట్ నాగరత్నం

పుత్తూరు రూరల్: స్థానిక గ్రంథాలయంలో వేసవి సెలవుల నేపథ్యంలో నిర్వహిస్తున్న సమ్మర్ క్యాంపును విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కాపువీధి ప్రభుత్వ పాఠశాల హిందీ పండిట్ నాగరత్నం సూచించారు. సోమవారం ఆయన సమ్మర్ క్యాంపు ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ జూన్ 11వ తేదీ వరకు జరిగే క్యాంపులో 5వ తరగతి నుంచి 10వ తరగతి విద్యార్థులు పాల్గొనవచ్చని తెలిపారు. క్యాంపులో కథలు చెప్పడం, పుస్తక పఠనం, డ్రాయింగ్, స్పోకెన్ ఇంగ్లీష్ వంటి పలు అంశాలపై శిక్షణ ఇస్తారని వివరించారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి మీనాకుమారి, సుజాత, సాయిగగన్, ప్రియ, షణ్ముగం పాల్గొన్నారు.

11 నుంచి భరతనాట్యంలో శిక్షణ

తిరుపతి కల్చరల్: బైరాగిపట్టెడలోని గంధమనేని శివయ్య భవన్‌లో 11వ తేదీ నుంచి ఉచితంగా భరతనాట్యంలో శిక్షణ ఇవ్వనున్నట్టు ఏపీ ప్రజానాట్యమండలి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిన్నం పెంచలయ్య తెలిపారు. శిక్షణ పొందాలనుకునే వారు భరతనాట్య గురువు స్వప్నను 8500165615లో సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలని తెలిపారు.

'చిదా' యాజమాన్యంపై చర్యలు తీసుకోండి



తిరుపతి జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న కార్మిక సంఘ నాయకులు

పుత్తూరు రూరల్: పుత్తూరులోని చిదా స్పిన్నింగ్ మిల్లు యాజమాన్యం కార్మికులను మోసం చేస్తోందని కార్మిక సంఘ నాయకులు విన్నవించారు. సోమవారం వారు తిరుపతి జిల్లా కలెక్టరేట్‌లో జరిగిన స్పందన కార్యక్రమంలో కలెక్టర్ వెంకటరమణారెడ్డికి మిల్లు యాజమాన్యం మోసాలపై వినతి పత్రం సమర్పించారు. 2022 ఫిబ్రవరిలో లేబర్ డిపార్ట్‌మెంట్ సమక్షంలో కార్మిక సంఘ నాయకులు, యాజమాన్యం మధ్య కుదిరిన వేతన ఒప్పందం ప్రకారం నాలుగేళ్ల పాటు మిల్లును యథావిధిగా కొనసాగించాల్సి ఉందన్నారు. అయితే నిబంధనలకు విరుద్ధంగా గత రెండు నెలల వ్యవధిలో 250 మంది కాంట్రాక్ట్ మహిళా కార్మికులను నుంచి తొలగించిందని, ప్రస్తుతం మిల్లులో 171 మంది మాత్రమే పనిలో ఉన్నారన్నారు. అయితే గత ఫిబ్రవరి 25వ తేదీన మిల్లును మూసివేస్తున్నట్లు యాజమాన్యం ప్రకటించిందని తెలిపారు. దీనిపై కార్మిక సంఘాలు ఆందోళన చేపట్టామన్నారు. ప్రస్తుతం ఫ్యాక్టరీని మూసివేయాలని యాజమాన్యం భావిస్తోందని, అయితే కార్మికులకు చట్టపరంగా న్యాయం చేయాల్సి ఉందన్నారు. దానికితోడు యాజమాన్యం చట్టాన్ని ఉల్లంఘిస్తూ, కార్మికులను బెదిరించి బలవంతంగా సంతకాలను సేకరిస్తోందని, సంతకాలు చేయని వారికి పరిహారం చెల్లించమని బెదిరిస్తోందన్నారు. మిల్లు మూసివేస్తే 171 మంది కార్మికులు రోడ్డున పడతారన్నారు. కార్మికులకు పూర్తిస్థాయిలో పరిహారం అందేలా న్యాయం చేయాలని జిల్లా కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు. ఫిర్యాదు ఇచ్చిన వారిలో సీఐటీయూ యూనియన్ అధ్యక్షుడు బాబు, కార్మిక సంఘ యూనియన్ కార్యదర్శి రవిచంద్రన్, కార్మికులు ఏలుమలైరెడ్డి, మణి, గోవిందరాజులు, సమాచార హక్కుల వేదిక కార్యదర్శి మురగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కుశస్థలి నదిలో పెరిగిన నీటి ప్రవాహం



కుశస్థలి నది నీటి ప్రవాహంలో చిక్కుకున్న ట్రాక్టరు

నగరి: ఇటీవల కురిసిన వర్షాలకు కృష్ణాపురంలోని అమ్మపల్లి డ్యాం నిండి గేట్లు తెరవడంతో సోమవారం ఉదయం నుంచే కుశస్థలి నదిలో నీటి ప్రవాహం పెరిగింది. దీంతో ఇసుక, రాళ్లు, గడ్డితో కనిపించే నది నీటి ప్రవాహంతో కళకళలాడింది. తెరణి సమీపంలో ఇసుక కోసం వెళ్లిన ఓ ట్రాక్టర్ నీటిలో చిక్కుకుంది. నీటి ప్రవాహం తగ్గేంత వరకు వాహనాన్ని బయటకు తీసే వీలు లేని పరిస్థితి నెలకొంది. దీంతో ట్రాక్టర్ డ్రైవర్ వాహనాన్ని నీటిలోనే వదిలి గట్టుకు చేరుకున్నారు.

రెవెన్యూ సమస్యలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి



రెవెన్యూ సిబ్బందితో మాట్లాడుతున్న తహసీల్దార్ బాబు

పాలసముద్రం: మండల పరిధిలోని అన్ని సచివాలయాల్లో ప్రజల నుంచి వస్తున్న రెవెన్యూ సమస్యలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టి సమస్యలు పరిష్కరించాలని తహసీల్దార్ బాబు తెలిపారు. సోమవారం రెవెన్యూ కార్యాలయంలో ఆయన రెవెన్యూ సిబ్బందికి నిర్వహించిన సమావేశంలో నిర్వహించారు. తహసీల్దార్ బాబు మాట్లాడుతూ ప్రభుత్వం ప్రజలకు, రైతులకు అనుగుణంగా నిర్వహించిన గ్రామ సచివాలయాల్లో వచ్చే రెవెన్యూ సమస్యలను త్వరలో పరిష్కారం చేయడానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. తెల్లరేషన్‌కార్డులకు ప్రభుత్వం పంపిణీ చేస్తున్న నిత్యావసర సరుకులు సక్రమంగా అందిందో లేదో చూడాల్సిన బాధ్యత సంబంధిత వీఆర్‌ఓలపై ఉందని తెలిపారు. కుల, తమ, ఆదాయ ధ్రువపత్రాలు ఆలస్యం లేకుండా ఇచ్చేందుకు కృషి చేయాలని తెలిపారు. జరుగుతునున్న రీసర్వేను బాధ్యతగా చేయాలని సూచించారు. కార్యక్రమంలో డిప్యూటి తహసీల్దార్ ముదబాబు, వీఆర్‌ఓ శ్రీనివాసులు, సాదు, రమణయ్య, తంగరాజ్, శంకర్, విలేజ్ సర్వేయర్లు పాల్గొన్నారు.

చెవుటి గంగమ్మకు ప్రత్యేక పూజలు





అమ్మవారికి పాలాభిషేకం చేస్తున్న వేదపండితులు, అమ్మవారి గెరిగె ఊరేగింపులో భక్తులు

పాలసముద్రం: మండలంలోని కృష్ణజమ్మపురం పంచాయతీ బలిజకండ్రిగ గ్రామంలో వెలసిన చెవుటి గంగమ్మతల్లి కొలుపు మహోత్సవంలో భాగంగా రెండవ రోజు సోమవారం ప్రత్యేక పూజలతో గెరిగె ఊరేగింపు అట్టహాసంగా జరిగింది. ఉదయం ఆలయ అర్చకులు మురళి అమ్మవారిని పాలు, పెరుగు, చందనం, తేనె, నెయ్యితో అభిషేకించారు. అనంతరం 10 గంటలకు గంగమ్మ అమ్మవారిని, గెరిగెను వివిధ సుగంధ పుష్పాలతో అలంకరించి దీపపుపూజ చేపట్టారు. గెరిగెను పంబవాయిద్యాలతో ప్రదక్షణగా ఊరేగించారు. ప్రతి ఇంటి నుంచి మహిళలు గెరిగెకు పసుపు నీటితో హారతులు ఇచ్చి, టెంకాయలు కొట్టి మొక్కుకున్నారు. సాయంత్రం అమ్మవారి ఎదుట పలు రంగులతో ముగ్గులు వేసి పూజలు చేశారు. అనంతరం ఆలయ అర్చకులు అమ్మవారిని భక్తులు తీసుకొచ్చిన పుష్పాలతో సుందరంగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు.